26042025-DIS-06_Layout 1 4/26/2025 4:09 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ద్రోహమే కాంగ్రెస్ నైజం

సిరికొండ మధుసూదనాచారి

భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన భారతదేశం పలు రాష్ట్రాలుగా ఏర్పాటైంది. దేశంలో మెజారిటీ ప్రజలు హిందీ మాట్లాడగా, ఆ ప్రాంతాలు అనేక రాష్ట్రాలుగా ఏర్పాటు చేయబడ్డాయి. హిందీ తర్వాత ఎక్కువమంది ప్రజలు మాట్లాడేది తెలుగు భాష. 1956కు పూర్వం మద్రాస్ రాష్ట్రంలో ఆంధ్రా ప్రాంతం, హైదరాబాద్ స్టేట్‌లో తెలంగాణ ప్రాంతం ఉండేవి. మద్రాస్ రాష్ట్రంలోని ఆంధ్రా ప్రాంతం బ్రిటిష్ వారి పాలనలో ఉండగా, హైదరాబాద్ స్టేట్‌లోని తెలంగాణ ప్రాంతం రాచరిక పాలనలో ఉండేది.

ఈ రెండు ప్రాంతాల భాష తెలుగే అయినప్పటికీ అనేక విషయాల్లో ఈ రెండు ప్రాంతాల ప్రజల్లో సామీప్యత లేదు. ఇద్దరి యాస వేరు, ఆహారపు అలవాట్లు వేరు, పండుగలు వేరు, సంస్కృతి సంప్రదాయాలు వేరు, ఆచార వ్యవహారాలు వేరు, కట్టూ బొట్టు వేరు, ఆనాటి వారి పేర్లలో తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఉదా-ఓబులేసు, మద్దిలేటి, రెడ్డమ్మ, ముణెమ్మ, పెంచలయ్య, సుబ్బారావు, అప్పారావు, పాత్రుడు, నూకరాజు, అప్పల నరసింహ, సన్నాసి ఆంధ్ర ప్రాంతం పేర్లు కాగా.. సమ్మయ్య, కొమురయ్య, రాజమ్మ, ఎల్లమ్మ, మల్లమ్మ, జానయ్య, సైదమ్మ, నరసింహ, యాదయ్య, పోశెట్టి, బొందాలు, లింబాద్రి, గంగవ్వ, సంగయ్య, పర్వతాలు, పెంటయ్య, ఇస్తారి, సోమన్న తెలంగాణ పేర్లు. ఆంధ్రా ప్రాంతం బ్రిటిష్ వారి పాలనలో ఉండి విద్య తదితర రంగాల్లో ముందుండగా తెలంగాణ విద్యలో వెనుకబాటుకు లోనైంది. సంపదను దోచుకోవడం, ఎదుటివారిపై పెత్తనం చెలాయించడమనే లక్షణం బ్రిటిష్ వారితో సహచర్యం వల్ల ఆంధ్రులకు అబ్బింది. రాచరిక పాలనలో ఉన్న తెలంగాణ ప్రజలకు అమాయకత్వం, మంచితనం తప్ప వంచన ఎరుగరు. నిజాం పాలనలో రజాకార్ల, పోలీసుల అరాచకాల వల్ల తమను తాము రక్షించుకోవడానికి ఆంధ్ర ప్రాంతానికి పోయి కొన్ని ఇండ్లలో తలదాచుకున్న వారిని ఆశ్రయం ఇచ్చినవారు ఏ విధంగా నిలువు దోపిడీ చేసినారో కథలు కథలుగా చెప్పేవారు. అందుకే, తెలంగాణ ప్రాంతం వారు ఆంధ్రతో కలిపే ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. రాచరిక పాలన కంటే భయంకర దోపిడీకి, అణచివేతకు గురౌతామని గగ్గోలు పెట్టారు. ఇదే విషయాన్ని తెలంగాణ ప్రజలు నాటి విద్యార్థులు, మేధావులు కొత్త రాష్ట్రాల ఏర్పాటుకోసం నియమించబడిన కమిషన్ చైర్మన్ ఫజల్ అలీకి నివేదించారు. ఫజల్ అలీ కమిషన్ కూడా తెలంగాణ ప్రజల ఆవేదనతో ఏకీభవించింది. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆవేదనను, ఆక్రందనను, ఏ మాత్రం పట్టించుకోక తెలంగాణ ప్రజల అభీష్టానికి భిన్నంగా ఆంధ్రా తెలంగాణను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పాటు చేసింది. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్ 1.**

తెలంగాణ ప్రజలు అనుమానించినట్టుగానే ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన మరుక్షణం నుంచే తెలంగాణ పట్ల వివక్ష మొదలైంది. వారి ఆధిపత్య అణచివేత, దోపిడి, దురహంకార, ధోరణి తెలంగాణ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఈ బాధలు కొన్నేండ్లు భరించిన తెలంగాణ ప్రజలు తెలంగాణ గడ్డ మీద రెండవ శ్రేణి పౌరులుగా బతుకడం సహించలేక స్వరాష్ట్ర ఏర్పాటు దిశగా ఆలోచన మొదలు పెట్టారు. 1969లో రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం ప్రారంభమై తెలంగాణ నలుచెరుగుల శరవేగంగా వ్యాపించింది. విద్యార్థులు యువకులు ముందుండి నడిపిన ఈ ఉద్యమాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వందల మందిని కాల్చి చంపి వేలాది మందిని జైళ్లపాలు చేసి అప్రజాస్వామికంగా, కర్కశంగా అణచివేసి తెలంగాణకు ద్రోహం తలపెట్టింది. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్ 2.**

> **1971లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా అప్రతిహతమైన విజయం సాధించగా, ఆ ప్రభంజనాన్ని ఎదిరించి టీపీఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలు ఘనమైన విజయాన్ని కట్టబెట్టి తమ ఆకాంక్షలోని హేతుబద్ధతను పవిత్రతను ఓటు తీర్పుగా ప్రకటించారు.**

తెలంగాణలోని 14 పార్లమెంట్ సీట్లలో 10 మంది (టీపీఎస్) అభ్యర్థులను గెలిపించారు. అప్రతిహతమైన, ఆలోచనాభరితమైన ఈ ప్రజా తీర్పును శిరసా వహించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటుచేయవలసిన ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిస్సిగ్గుగా తెలంగాణ ప్రజా సమితి లోక్‌సభ సభ్యులను కాంగ్రెస్‌లో విలీనం చేసుకొని ప్రజాస్వామ్య పవిత్రతకు మాయని మచ్చ తెచ్చింది. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్-3.**

తదనంతర కాలంలో 1983లో టీడీపీ అధికారంలోకి వచ్చేవరకు పెద్ద మనుషుల ఒప్పందం, 6 సూత్రాల పథకాలకు తిలోదకాలిచ్చి తెలంగాణ నీళ్లు, నిధులు, నియామకాలు, భూములు యథేచ్ఛగా దోపిడీ కావడానికి, అన్యాక్రాంతం కావడానికి కాంగ్రెస్ అగ్రనాయకత్వం కనుసన్నలలో ఆంధ్ర నాయకత్వం దురాగతాలకు పాల్పడింది. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్-4.**

టీడీపీ హయాంలోనూ ఈ వైఖరే కొనసాగింది. 2001లో ఆవిర్భవించి, తెలంగాణలో కేసీఆర్ నాయకత్వంలో ఎదుగుతున్న టీఆర్ఎస్ రాష్ట్ర రాజకీయాల్లో నిర్ణయాత్మక శక్తిగా ఎదగగా 2004 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ అనుకూలం, కట్టుబడి ఉన్నామని ప్రకటించి టీఆర్ఎస్ పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకొని రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్నికల్లో గెలిచింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ కామన్ మినిమం ప్రోగ్రాంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని చేర్చి, అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం నోట పలికించి, తదనంతర కాలంలో ఉలుకూ పలుకు లేని నాన్చివేత ధోరణిని ప్రదర్శించింది. యూపీఏకు నాయకత్వం వహించిన కాంగ్రెస్ మోసాన్ని నిరసించిన కేసీఆర్ రాష్ట్రంలోని ఆరుగురు టీఆర్ఎస్ మంత్రులచే రాజీనామా చేయించారు. అయినప్పటికీ కాంగ్రెస్ వైఖరిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. తదనంతరం లోక్‌సభ సభ్యత్వానికి కేసీఆర్ రాజీనామా చేయడం కాంగ్రెస్ ద్రోహ ఫలితమే. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్-5.**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దేశంలోని 37 పార్టీలు తమ అంగీకార పత్రాలను సమర్పించినప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వకపోగా, రాష్ట్రంలోని నాటి ముఖ్యమంత్రి వైఎస్ మిత్రధర్మానికి భిన్నంగా 11 మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి, చీల్చి టీఆర్ఎస్‌ను అస్థిరపరిచే ద్రోహానికి తలపడ్డాడు. 2009 ఎన్నికల్లో మరోసారి అధికారం చేపట్టిన కాంగ్రెస్ టీఆర్ఎస్ శాసనసభ్యులను చేర్చుకొని టీఆర్ఎస్ ఉనికి లేకుండా చేయాలని చూసింది. ఆ తర్వాత 2009, అక్టోబర్‌లో 14 ఎఫ్‌కు సంబంధించిన ఒక కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సాధనే జీవిత లక్ష్యంగా ఉద్యమాన్ని సాగిస్తున్న 'కేసీఆర్ సచ్చుడో-తెలంగాణ వచ్చుడో...', 'తెలంగాణ జైత్రయాత్రో- కేసీఆర్ శవయాత్రో' అంటూ భీష్మించి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణలోని ప్రతి గుండెను తట్టి లేపింది. తెలంగాణ యావత్ ఆందోళనలతో అట్టుడికింది. ఎగిసిపడుతున్న ఉద్యమం, సబ్బండ వర్గాలు ఏకమై సాగుతున్న నిరసనలు, తెలంగాణే దీక్ష శిబిరంగా పరిణమించగా పూర్తిగా క్షీణించిన కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై పార్లమెంట్ ఆందోళన వ్యక్తం చేయగా కేంద్ర ప్రభుత్వం తరపున నాటి హోంశాఖ మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నామని, కేసీఆర్ నిరహారదీక్ష విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటన ఫలితంగా కేసీఆర్ దీక్షను విరమించారు. ఆగమేఘాల మీద సీమాంధ్రులు సృష్టించిన నకిలీ ఉద్యమం ప్రభావానికి, ఒత్తిడికి లోనైన కేంద్రం యూ-టర్న్ తీసుకొని ఘోరాతి ఘోరమైన ద్రోహం చేసింది. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్-6.**

కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టగా అరెస్టు చేశారన్న వార్త విని ఖిన్నుడైన శ్రీకాంతాచారి అదే రోజు తనపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోగా డిసెంబర్ 3న అమరుడయ్యాడు. శ్రీకాంతాచారి బలిదానం యావత్ జాతిని కలచివేసింది, కదిలించింది. తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షలోని పవిత్రతను, దాని తీవ్రతను చాటడానికి మూర్ఖుల, ద్రోహుల, దుర్మార్గుల కండ్లు తెరిపించడానికి, లక్ష్యసాధన కోసం వందలాది మంది యువకులు కావాలని జాతి విముక్తికి ప్రాణత్యాగం చేశారు. దీనంతటికీ కారణం కాంగ్రెస్. **ఇది తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహం నెంబర్-7.**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించి, ఆ లక్ష్యాన్ని సాకారం చేసి, నిన్న అధికార పార్టీగా రాష్ట్రాన్ని పదేండ్ల పాటు సుభిక్షంగా, సుఖ, సంతోషాలకు ఆలవాలంగా నిలబెట్టి, నేడు ప్రతిపక్ష పార్టీగా 16 నెలలుగా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వ దుర్మార్గాన్ని అడుగడుగునా చీల్చి చెండాడుతూ తెలంగాణ ప్రాంత ప్రయోజనాలే ఆశగా, శ్వాసగా కేసీఆర్ నాయకత్వాన రజతోత్సవం జరుపుకొంటున్న వేళ చరిత్రాత్మకమైన భారీ బహిరంగసభకు తెలంగాణలోని ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక్కరు తరలివెళ్తాం. చరిత్రలో అనేక సందర్భాల్లో తెలంగాణకు ద్రోహం తలపెట్టిన, ఇప్పటికీ తలపెడుతూనే ఉన్న కాంగ్రెస్ పార్టీ ద్రోహాన్ని ప్రజా సమూహంగా నిలదీద్దాం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకులు)

కేసీఆర్.. మాటలే తూటాలై..

సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

మనిషి జీవితంలో ప్రాణానికి మించిందేదీ లేదు. అటువంటిది ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం వందల మంది తమ ప్రాణాలను ధారపోశారు. అలాంటి అమరవీరులను స్మరించడం అనివార్యం. 'తెలంగాణ ప్రజలను రాజకీయంగా చైతన్యపరిచి ప్రజాస్వామ్యబద్ధంగా పార్లమెంటును ఒప్పించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే తెలంగాణ రాష్ట్ర సమితి అంతిమ లక్ష్యం' అని తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం సందర్భంగా జలదృశ్యంలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ నాయకుడు కేసీఆర్ వ్యాఖ్యానించారు.

తాను కోల్పోయిన ఉనికిని తెలంగాణ తిరిగి ఎలా ప్రతిష్ఠించుకున్నదన్న విషయం తెలుసుకోవాలంటే చరిత్ర లోతుల్లోకి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. భారత స్వాతంత్ర్యానికి ముందు కొన్ని సంస్థానాలు మినహా దేశమంతా బ్రిటిష్ పాలనలో ఉండేది. హైదరాబాద్ సంస్థానంలో అంతర్భాగమైన తెలంగాణ నిజాం పాలనలో ఉండేది. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే తెలంగాణ 1948, సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనమైంది. హైదరాబాద్ రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేసుకునేందుకు నిజాం రాజును లొంగదీసుకోవడం కోసం 'ఆపరేషన్ పోలో' పేరుతో కేంద్రం పోలీస్ యాక్షన్ చేపట్టిందని చరిత్ర లిఖించబడినది. తెలంగాణలో జరుగుతున్న సాయుధ రైతాంగ పోరాటం దేశమంతా విస్తరించకుండా అణచివేసేందుకే నిజాంను లొంగదీసుకోవడం అనే ముసుగులో నాటి నెహ్రూ ప్రభుత్వం 'ఆపరేషన్ పోలో' పేరిట తెలంగాణ మీదికి సాయుధ బలగాలను పంపారని తర్వాత కాలంలో ప్రజలకు అర్థమైంది. ఆ తర్వాత తెలంగాణలో సాధారణ ఎన్నికలు నిర్వహించేవరకు ఎంకే వెల్లోడి తెలంగాణకు ముఖ్యమంత్రిగా వ్యవహరించే విధంగా కాంగ్రెస్ కుట్ర పన్నింది. వెల్లోడి ప్రభుత్వ కాలంలోనే చాపకింద నీరులా భాష పేరుతో, ఇతర కారణాలతో ఇక్కడికి చేరి ప్రభుత్వంలో ఇతర ప్రాంతాల వారు, ముఖ్యంగా ఆంధ్ర వారు ఉద్యోగాలు పొందారు.

> **1952లో తెలంగాణలో ఎన్నికలు జరిగాక బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 1956 వరకు కూడా వెల్లోడి చీఫ్ అడ్వైజర్‌గా నెహ్రూ ప్రభుత్వం కొనసాగించింది. ఫజల్ అలీ కమిషన్ సిఫారసులకు వ్యతిరేకంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు అనే కుట్రకు తెరలేపి హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రాలో విలీనం చేశారు.**

ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తెలంగాణలో ఉద్యోగాలు పొందడమనేది నిజాం కాలంలో మొదలై, వెల్లోడి పాలన, ఉమ్మడి ఏపీలో కూడా కొనసాగింది. ఇది తెలంగాణ ఏర్పాటయ్యే వరకు కొన్ని దశాబ్దాలుగా కొనసాగింది. ఈ పరిస్థితులకు అడ్డుకట్ట వేయడానికి తెలంగాణ సాధించిన కేసీఆర్ ఎంతో ముందుచూపుతో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ యువతకే దక్కే విధంగా చట్టసవరణ చేశారు. నిజాం కాలం నుంచే హైదరాబాద్ ప్రపంచానికి ఒక మోడల్‌గా నిలిచింది. నిజాం రాచరిక పాలనతో పాటు ఫ్యూడల్ దోపిడీ ఉన్నప్పటికీ తెలంగాణలో విద్య, వైద్యం, సాగునీరు, రవాణా, విద్యుత్తు రంగాలలో ఆధునిక దేశాల సరసన హైదరాబాద్ సంస్థానం ఉన్నాయనేది చారిత్రక సత్యం. తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన తర్వాత తిరిగి తెలంగాణ ఏర్పాటు ఏ విధంగా తెలంగాణ వెనుకపడేయబడిందో అందరికీ తెలిసిందే.

చెరువులు, కుంటలతో భాసిల్లిన ప్రాంతం తెలంగాణ. కులమతాల అంతరాలు దైనందిన జీవితంలో కనిపించకుండా ఒక సమతుల్యత పాటించిన ప్రాంతం తెలంగాణ. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగా తెలంగాణలోని జలాలను ఆంధ్రాకు మళ్లించుకుపోవడం, చెరువులు, కుంటలను నిర్లక్ష్యం చేయడం, కట్టిన ప్రాజెక్టుల సామర్థ్యం కుదించడం, తెలంగాణకు చేకూరాల్సిన ప్రయోజనం కలిగించకుండా, దశాబ్దాల పాటు ప్రాజెక్టుల నిర్మాణం సాగదీయడం, కట్టాల్సినవి కట్టకపోవడం ఉమ్మడి పాలనలో నిరంతరం జరిగింది. అన్ని రంగాల్లో తెలంగాణ మీద వివక్ష ప్రదర్శించి చివరికి తెలంగాణ అన్న పదం ఉచ్ఛరించలేని స్థితికి తీసుకువచ్చారు.

> **1969 తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసిన తర్వాత అహంకారంతో యథేచ్ఛగా ఆంధ్రా పరిపాలన కొనసాగింది. అంతటి వివక్ష పాలనలో ప్రజలు విసిగి వేసారి ఉన్న సమయంలో తెలంగాణ జనసభ, మహాసభలు తెలంగాణ ప్రజల్లో కొంతమేరకు చైతన్యపరిచే ప్రయత్నం కొన్ని ప్రాంతాల్లో చేశాయి. కోల్పోయిన తెలంగాణ రాష్ట్రం తిరిగి ఉనికిలోకి ఎలా తీసుకురాగలమన్న విషయంలో మాత్రం స్పష్టత 2001 నాటికి లేని పరిస్థితి.**

తెలంగాణ రాష్ట్ర అవతరణ మాత్రమే లక్ష్యంగా కేసీఆర్ 2001, ఏప్రిల్ 27న టీఆర్ఎస్‌కు అంకురార్పణ చేశారు. అప్పుడు జలదృశ్యంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ బానిసత్వానికి అలవాటుపడిన తెలంగాణ టీడీపీ, కాంగ్రెస్ నేతలు, పరిమితంగా ఉన్న బీజేపీ నేతలు మింగుడుపడక ఎగతాళి చేశారు. స్వామిభక్తి పేరుతో వారు అడుగడుగునా బానిసత్వాన్ని చాటుతూ వచ్చారు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డిలకు ఊడిగం చేశారు నాటి కాంగ్రెస్, టీడీపీ నాయకులు. తెలంగాణ పట్ల జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించకపోగా ఉద్యమంలోని క్లిష్ట సమయాల్లో తెలంగాణ ఉద్యమాన్ని అవహేళన చేసేవారు. టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్ వేసిన ఎత్తుగడలు, ఆలోచనతో కూడిన వ్యూహాత్మకంగా వదిలిన మాటలే తూటాలై తెలంగాణ సమాజాన్ని ఏకం చేశాయి. ఒకరు పదులుగా, పదులు వందలుగా, వందలు వేలుగా, వేలు లక్షలుగా, లక్షలు కోట్లయి సకల జనులను కదిలించి వారి ఐక్యతకు పునాది వేసింది కేసీఆర్ ఆలోచనలే. తెలంగాణ ఒక్క కేసీఆర్ వల్ల రాలేదన్న వంకర మాటలు మాట్లాడే వారి పాత్ర తెలంగాణ ఉద్యమంలో విద్రోహ పాత్రనే. కేసీఆర్ ఎంతో చతురత, వ్యూహంతో కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలను ముగ్గులోకి లాగి వారిని తెలంగాణ అనకతప్పని అనివార్య పరిస్థితిని తీసుకువచ్చారు. వారి శ్రేణులను, పార్టీలను సందర్భానుసారంగా పార్టీలోకి చేర్చుకుంటూనే ఉద్యమం వైపు నడిపించారు. రాజీనామాలు, ఉప ఎన్నికలు, ప్రత్యక్ష ఆందోళనా రూపాలు, ఒకటి కాదు, టీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఈ 25 ఏండ్ల కాలంలో బీఆర్ఎస్, కేసీఆర్ ప్రసావన లేకుండా ఏపీ, తెలంగాణలో రాజకీయాలు నడిచిన పరిస్థితి లేదు. ఇదొక ప్రాంతీయ పార్టీగా ఉద్భవించిన పార్టీ 25 ఏండ్ల ఉజ్వల ప్రస్థానం. ఎన్నికల్లో గెలుపోటములు ముఖ్యం కాదు. తెలంగాణ ప్రజలకు కోల్పోయిన తమ అస్తిత్వాన్ని తిరిగి పొందేలా చేసింది బీఆర్ఎస్. ఉనికినే కోల్పోయి, తానెక్కడుందో భారత చిత్రపటంలో తెలియని పరిస్థితిలో తెలంగాణను సుస్థిరం చేయడమే కాదు, అన్నిరంగాల్లో అగ్రభాగాన నిలిపి ఒక నమూనాగా చూయించింది కేసీఆర్.

2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్ నేతృత్వంలోని ప్రభుత్వం తెలంగాణను ఆర్థికంగా, సమృద్ధిగా మార్చే దిశగా అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ (జీడీపీ) రూ.4.9 లక్షల కోట్ల నుంచి రూ.13.5 లక్షల కోట్లకు పెరుగగా, ప్రతి వ్యక్తికి ఆదాయం రూ.1.12 లక్షల నుంచి రూ.3.47 లక్షలకు గణనీయంగా పెరిగింది. ద్రవ్యవ్యాప్తిలో సైతం 200 శాతం వృద్ధి నమోదైంది. నీటి పరిపాలనలో తెలంగాణ కొత్త అధ్యాయం లిఖించింది. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పథకంగా పేరుగాంచిన కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు, మిషన్ కాకతీయ ద్వారా 46,000 చెరువుల పునరుద్ధరణ జరిగింది. ఫలితంగా భూగర్భ జల మట్టాలు 6 మీటర్ల మేర పెరిగాయి. రైతుల సంక్షేమం దిశగా రైతుబంధు ద్వారా రూ.72,000 కోట్ల పెట్టుబడి మద్దతును అందించగా, రైతు బీమా పథకంతో లక్షల మంది రైతుల కుటుంబాలకు 5 లక్షల బీమా భద్రతను కల్పించింది. అంతేకాదు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తును అందించి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచింది.

> **ఈ దేశంలో పుట్టిన ఎన్నో రాజకీయ పార్టీలు రాజకీయ అస్తిత్వం కోసం, రాజకీయ పదవుల కోసం, అధికారం కోసమే పుట్టాయి. కాలగమనంలో కొన్ని అంతరించిపోయాయి. కానీ, దేశంలో ఉన్న ప్రత్యేకతలను దృష్టిలో పెట్టుకుని ఆలోచించినప్పుడు భిన్న భాషా సంస్కృతులు, భిన్న ఆచారవ్యవహారాలు, భిన్న వైవిధ్యభరితమైన సువిశాల దేశంలో రాష్ట్రాల ప్రాధాన్యాలను, ఆయా ప్రాంతాల అభిలాషలను సమన్వయపరచడం గానీ, అర్థం చేసుకోవడం గానీ చేయని కారణంగానే జాతీయపార్టీలు విఫలమయ్యాయి. అందుకే ఈ దేశంలో అత్యంత బలీయమైన శక్తులుగా ప్రాంతీయ పార్టీలున్నాయి.**

కొన్ని జాతీయ పార్టీలు అంతరించిపోతున్నాయి కానీ, ప్రాంతీయ పార్టీలేవీ కనుమరుగైన దాఖలాలు లేవు. అన్ని ప్రాంతీయ అభిలాషకన్నా బలమైన, భిన్నమైన అభిలాష తెలంగాణది. భిన్నమైన చరిత్ర, భిన్నమైన పోరాటం తెలంగాణ సొంతం. అందుకే, తెలంగాణ అజేయంగా నిలిచింది. దీన్ని ఎవరూ రూపు మాపలేరు. దీన్ని ఎవరూ చరిత్ర నుంచి చెరపలేరు. ఈ 25 ఏండ్ల బీఆర్ఎస్ పార్టీ ప్రస్థానం అనేది ఒక తెలంగాణలోనే కాదు, భారతదేశ రాజకీయాల్లోనే ఒక అద్వితీయమైన ఘట్టం. ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలను ఎంత గొప్పగా నిర్వహించవచ్చో ఆధునిక యుగంలో రుజువు చేసినటువంటిది కేసీఆర్ నాయకత్వంలో జరిగిన తెలంగాణ ఉద్యమం. ఇది దేశానికే కాదు, ప్రపంచ పోరాటాలకే అనుసరణీయం. అది తెలంగాణ సాధించిన శాశ్వతమైన గెలుపు. కోల్పోయిన ఉనికిని తిరిగి సాధించిన పార్టీగా రజతోత్సవం సందర్భంగా తన విజయాన్ని తానే నమోదు చేసుకుంటున్నది.

(వ్యాసకర్త: వ్యవసాయ శాఖ మాజీ మంత్రి)

తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ అయిన స్వరాష్ట్రం అనే లక్ష్యాన్ని ముద్దాడిన తర్వాత అది కొంతమందికి సాదాసీదాగా అనిపించవచ్చు. అది సాధారణ విషయమేనని కొందరు కొట్టిపారేయనూ వచ్చు. కానీ, పాతికేండ్ల కిందట అది మహోజ్వల, చారిత్రక, అనితర సాధ్యమైన విషయం.

ఎన్నో ఘట్టాలు, ఎన్నెన్నో...

బోయినపల్లి వినోద్ కుమార్

ఉద్యమ రథ సారథి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఏర్పాటు ఆలోచన, నిర్ణయం వెనుక ఉన్న కథ ఇదీ.. గతంలోకి వెళ్తే.. ''1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కొనసాగుతుండగానే... 1971లో దేశంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. అప్పుడు దేశంలో ఇందిరాగాంధీ ప్రభంజనం వీస్తున్నది. దాన్ని ఎదిరించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తున్న చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్)కు తెలంగాణ ప్రజలు పట్టంగట్టారు. తెలంగాణలోని 14 పార్లమెంట్ సీట్లలో 11 మంది (టీపీఎస్) అభ్యర్థులను గెలిపించారు. ఆ తొలి దశ ఉద్యమంలోనే 365 మంది విద్యార్థులు తెలంగాణ కోసం అమరులయ్యారు. దీంతో ఉద్యమం ఉధృతమైంది. కర్ఫ్యూలు విధించారు. ఇన్ని జరిగినా తెలంగాణ ఎందుకు ఇవ్వలేదు? స్వరాష్ట్రం కల ఎందుకు సాకారం కాలేదు? టీపీఎస్‌కు చెందిన 11 మంది ఎంపీలు ఢిల్లీలో తెలంగాణ గళాన్ని వినిపించినా, అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ వారిని కాంగ్రెస్‌లో కలుపుకున్నారు.'' ఇలాంటి అనేక విషయాలపై టీఆర్ఎస్ పార్టీ స్థాపనకు ముందే ఏడాది పాటు కేసీఆర్ సుదీర్ఘ చర్చలు జరిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, సాధ్యాసాధ్యాలపై సంపూర్ణ అధ్యయనం చేశారు. ఈ విషయాన్ని ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్వయంగా చెప్పారు. 'పార్టీ పెట్టాలా, వద్దా? పార్టీ పెడితే తెలంగాణ కచ్చితంగా రావాలి. అంతే తప్ప, తెలంగాణ పేరిట ఉద్యమాలు చేసి ప్రజలను మభ్యపెట్టవద్దు. వారికి ఆశలు కల్పించి మళ్లోసారి తెలంగాణను కాంగ్రెస్‌కు తాకట్టు పెట్టొద్దు. కాంగ్రెస్ చేతుల్లో తెలంగాణవాదం అణచివేయబడొద్దు. పోలీసుల చేతిలో తెలంగాణ ప్రజలు మళ్లీ లాఠీ దెబ్బలు తినవద్దు. ఈ పరిస్థితుల్లో తెలంగాణలో రక్తపాతం జరగొద్దు. అసలు తెలంగాణ రాష్ట్రం వచ్చే అవకాశం ఉందా, లేదా?' అనే అంశాలపై కేసీఆర్ లోతైన అధ్యయనం చేశారు.

టీఆర్ఎస్ స్థాపనకు ఏడాది ముందునుంచే కేసీఆర్ ప్రతిరోజు గంటల తరబడి పలురంగాల మేధావులు, నిష్ణాతులు, పెద్దలతో మేధో మథనం చేశారు. పార్టీలో సిద్ధాంతాలను పక్కనపెట్టి టీడీపీలోని తన సహచరులు, పలు పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులను, నేతలను, భిన్న భావజాలాలు కలిగిన వారు, 1969 ఉద్యమకారులు, తెలంగాణ వాదులు, న్యాయ నిపుణులు, మేధావులు, కవులు, రచయితలు, కళాకారులు, విద్యావంతులు, యువత